క్లుప్తంగా

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని అనేక ప్రధాన కాల్వలను పరిశీలించి అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచు వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు రోడ్లపై నిలవకుండా చూడాలన్నారు. అలాగే ప్రధాన కాల్వల్లో పూడిక తీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ సునీల్, శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నూరు శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో నూరు శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 15,16 వార్డులలో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. మురుగు కాల్వలను బాగు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు గుంటూరు కోటేశ్వరరావు, దివి అనిత, టీపీవో సాంబశివరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



తెనాలిఅర్బన్: నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం సాయంత్రం ఆయన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వ్యాధులతో బాధపడుతూ ప్రవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన 14 మందికి రూ.16.45 లక్షల విలువ చేసే చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 134 మందికి రూ.1.78కోట్ల విలువ చేసే చెక్కులు పంపిణీ చేసినట్లు చెప్పారు. అవసరమైన వారు సీఎంఆర్ఎఫ్ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలిరూరల్: ప్రమాదవశాత్తు జారి పడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని హాఫ్‌పేట గ్రామానికి చెందిన కోటయ్య(44) 19వ తేదీ రాత్రి తన ఇంటి మిద్దెపై నిద్రపోయాడు. మధ్య రాత్రిలో కాలకృత్యాలకు లేచి దిగుతూ మెట్ల నుంచి జారి పడి గీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం కేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్.కె. ఆనంద్ బుధవారం తెలిపారు.

వైద్యాధికారులకు శిక్షణ కార్యక్రమం

గుంటూరు మెడికల్: స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం పీహెచ్, యూపీహెచ్, తదితర ఆస్పత్రుల్లో పనిచేసే వైద్య అధికారులకు రొటీన్ ఇమ్యూ నైజేషన్ నూతన మ్యాన్యువల్ 024–25పై నిర్వహించిన మూడురోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో టీకాల కార్యక్రమం సమర్థంగా ఏ ఒక్క గర్భిణి, చంటిబిడ్డ, మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ద్వారా హెడ్ కౌంట్ సర్వే నిర్వహించాలని కోరారు. పటిష్ట ప్రణాళిక రూపొందించి, సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు చేయాలన్నారు. సర్వేలెన్స్ వైద్య అధికారి డాక్టర్ ఎ.భవానీ, యూఎన్‌డీపీ ప్రోగ్రాం అధికారి ఎం.మధుకరరావు ప్రాధాన్యాన్ని వివరించారు.

ద్వారకా నగర్‌లో మురుగు కష్టాలు

- పారుదల లేని కాల్వలతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టణాన్ని ఆనుకుని ఉన్నా అభివృద్ధికి దూరం
- సమస్యలను పరిష్కరించాలంటూ స్థానికుల వినతి



ఇళ్ల ముందు రోడ్లపైకి వస్తున్న మురుగు



కాలనీలో కాల్వల దుస్థితి



పారుదల లేని కాల్వ

తెనాలిరూరల్: మండలంలోని మల్లెపాడు గ్రామంలోని ద్వారకానగర్‌లో ప్రజలకు మురుగు తిప్పలు తప్పడం లేదు. పారుదల లేని కాల్వలతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో పక్కా డ్రెయిన్‌ల నిర్మాణం సంతతి అధికారులు, పాలకులు మర్చిపోయినా.. ఉన్న కచ్చా కల్వలోని సిల్ట్‌ను తొలగించే నాథుడే లేదు. తెనాలి పట్టణాని కన్నా ముందే నాగరికత విలసిల్లిన తెనాలి మండలం మల్లెపాడు గ్రామంలోని ఈ ప్రాంతం సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, మురుగు ఎక్కడికక్కడే నిలచిపోవడం, వీధిలైట్లు వెలగక పోవడం, వంటి కారణాలతో కునారిల్లుతోంది.

తెనాలి పట్టణానికి దక్షిణాన, పట్టణ శివారుకు కూతవేటు దూరంలో మల్లెపాడు పంచాయతి ఉంది. పట్టణ 24వ వార్డు శివారు శాంతినగర్ మీదుగా గ్రామంలోకి వెళ్లే ఏకైక మార్గం ఉంది. ఇక ఇదే వార్డును ఆనుకుని మల్లెపాడు పరిధిలోని ద్వారకా నగర్ ఉంది. ఇక్కడి రోడ్డుకు ఉత్తరం వైపున పట్టణ పరిధిలోని 24, 23 వార్డులు ఉంటే.. దక్షిణం వైపున ద్వారకానగర్ ఉంది. పట్టణ పరిధిలో డ్రెయిన్‌ల నిర్మాణం, నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నా, ఆనుకుని ఉన్న ద్వారకా నగర్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. సరైన డ్రెయిన్లు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్క ప్రతిరోజు మురుగు రోడ్లపైకి పొంగి పొర్లుతుంటుంది. మురుగునీరు పోయే దారి లేకపోవడం, డ్రెయిన్‌ల నిర్మాణం చేయక పోవడంపై స్థానికుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతుండడంతో చేసేది లేక పంచాయతీ అధికారులు గతంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు గండి కొట్టి మురుగును పట్టణ పరిధిలోని మల్లెపాడు డ్రెయిన్‌లోకి పోయేలా చేసి చేతులు దులుపుకున్నారు. చిన్నపాటి వర్షానికే కాలనీ మొత్తం మురుగు నీటి కాల్వలు పొంగిపొర్లుతున్నాయి. దీనికి తోడు దోమల బెడద, పందుల సంచారం అధికంగా ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం, మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో అధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల కోరుతున్నారు.

సిబ్బందిని కేటాయించాం

ద్వారకానగర్‌లో కాల్వల్లోని సిల్ట్ తీయించేందుకు 10 మంది సిబ్బందిని కేటాయించాం. కాలనీని స్వయంగా పరిశీలించి అందుకు తగిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే సిబ్బందిని ప్రత్యేకంగా విధులకు కేటాయించి కాల్వల సమస్యను పరిష్కరిస్తాం.

జి. రవితేజ, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి, మల్లెపాడు

ఆక్రమణలను పరిశీలించిన తహసీల్దార్



తెనాలిరూరల్: పట్టణంలో ఆక్రమణలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పరిశీలించారు. స్థానిక పాండురంగ పేట, ఇందిరానగర్ కాలనీలో ఆయన బుధవారం పర్యటించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 17న పట్టణంలో పర్యటించిన నేపథ్యంలో ఆక్రమణల క్రమబద్ధీకరణ అంశం స్థానికులు పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. ప్రభుత్వానికి ఇబ్బందిలేని ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు ఆయన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆదేశాల మేరకు తహశీల్దార్ బుధవారం పట్టణంలో పర్యటించి ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణకు అనుకూలమైన ప్రదేశాలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. ఎంతకాలంగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు, వారి వద్ద ఉన్న ఆధారాలు, వారు ఆక్రమించిన ప్రాంతం ప్రభుత్వానికి భవిష్యత్తులో ఏదైనా అవసరమా, ఇబ్బందికరమా అనే అంశాలను పరిశీలించారు. ఆయన వెంట వీఆర్‌వోలు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు, సిబ్బంది ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా ఉండాలి

సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ



మాట్లాడుతున్న సంజనా సింహ

తెనాలి: ప్రజాసమస్యల పరిష్కారంలో సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా వ్యవహరించాలని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ స్పష్టంగాచేశారు. ప్రాథమిక బాధ్యతలను గుర్తుంచుకొని వ్యవహరించాలని చెప్పారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో బుధవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సదస్సుకు సబ్‌కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజల్లో ఇప్పుడు చాలా చైతన్యం వచ్చిందనీ, కొందరిలో సహనం కూడా తగ్గిపోతోందని సబ్‌కలెక్టర్ చెప్పారు. ఎవరైనా వెళ్లినపుడు తమను పట్టించుకోలేదని చెప్పినప్పుడు ఇబ్బందులు తప్పవన్నారు. నియోజకవర్గాల్లో పర్యటించినపుడు ప్రజల నుంచి మంచి ఫీడ్‌బ్యాక్ రావాలనేది రాజకీయ నాయకుల భావనగా గుర్తుచేశారు. సచివాలయ ఉద్యోగుల వ్యవహారశైలి మారాల్సి ఉందన్నారు. సచివాలయం పరిధిలోని ప్రజల సమస్యలు, కష్టాలపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని, తమ పరిధిలోనివి అయితే పరిష్కరించటం, అంతకు మించినవైతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. చాలామంది ప్రజలు సచివాలయం సిబ్బందిని చూడలేదంటున్నారని చెబుతూ 'మీరే మాకు కళ్లూ చెవులూ కాకుంటే ఎలా' అంటూ ప్రశ్నించారు. విధుల పట్ల బాధ్యతగా ఉంటూ ప్రజలతో సానుభూతిగా వ్యవహరించాలని చెప్పారు.

సచివాలయ ఉద్యోగులు జాబ్‌చార్ట్‌తో పాటు ప్రభుత్వం అదనంగా ఇచ్చే విధులను తప్పనిసరిగా నిర్వర్తించాలని స్పష్టంగా చెప్పారు.

మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మసలుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తన ప్రసంగంలో ప్రభుత్వం ఇచ్చిన సర్వేలకు వెళ్లినపుడు సమస్యలు కూడా తెలుసుకుంటే సానుకూల స్పందన వస్తుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, సచివాలయ ఉద్యోగులు రాజ్‌కుమార్, ప్రశాంతి, తిరుపతిరావు తదితరులు మాట్లాడారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలిరూరల్: ప్రమాదవశాత్తు జారి పడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని హాఫ్‌పేట గ్రామానికి చెందిన కోటయ్య(44) 19వ తేదీ రాత్రి తన ఇంటి మిద్దెపై నిద్రపోయాడు. మధ్య రాత్రిలో కాలకృత్యాలకు లేచి దిగుతూ మెట్ల నుండి జారి పడి గీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వైద్యశాల నుండి వచ్చిన సమాచారం కేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్: కె. ఆనంద్ బుధవారం తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంగళగిరి: పట్టణంలోని గౌతమ బుద్ధ రోడ్డులో మందాకిని బార్ వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని గమనించిన స్థానికులు బుధవారం పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రవీంద్ర నాయక్ వివరాలు సేకరించి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటాయని, మెరూన్ రంగు గళ్ల చొక్కా, బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ప్రసన్నాంజనేయుడికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామికి హనుమజ్జయంతి సందర్భంగా బుధవారం విశేష పూజలు చేశారు. ఉదయాన్నే పంచామృతాలు, పండ్ల రసాలు, చందనంతో శ్రీ,పురుష, హనుమత్ సూక్తాలతో అర్చకులు ప్రసన్నమూర్తి, ఎస్.రాజభట్టర్, నిఖిల్ భరద్వాజ్‌లు అభిషేకాలు నిర్వహించారు. నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. అనంతరం యాగశాల వద్ద వేదపండితులు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గణపతి, సుదర్శన హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్వామివారి పవళింపుసేవ



పాల్గొన్న భక్తులు

తెనాలి: పట్టణంలో చిన్నతిరుపతిగా ప్రసిద్ధి చెందిన వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఏడురోజులపాటు జరిగిన ఈ ఉత్సవాల్లో చివరిరోజైన బుధవారం రాత్రి ఏడు గంటలకు ద్వాదశ ప్రదక్షణములు చేశారు. రాత్రి 8.30 గంటలకు స్వామివారి ఏకాంతసేవను నిర్వహించారు. ఉదయం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను కొనసాగించారు. ఆలయ అర్చకులు కార్యక్రమాలను నిర్వహించగా, ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ పర్యవేక్షించారు.

రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరవరానివి

తెనాలిఅర్బన్: దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరవరానివని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.


ఈసందర్భంగా సాంబశివుడు మాట్లాడుతూ ప్రధాన మంత్రిగా ఆయన దేశంలో అనేక నూతన సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. పేదల సంక్షేమానికి ఆయన పాటుపడ్డారని కొనియాడారు. ఆయన బాటలో అందరు నడవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, గుర్రపు ద్వారక శ్రీనివాసరావు, కర్లపూడి బుల్లియ్య, పెనుకొండ శివకుమార్, భీమ రమేష్, పినపాటి స్టీవెన్ బాబు, శంరరావు, కోటేశ్వరరావు, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సాంబశివుడు

వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

ఫిరంగిపురం: మండలంలో బుధవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లోని కాలువలు నిండి మురుగు రోడ్లుపైకి చేరింది. ఫిరంగిపురంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న కాలువలు పూడుకుపోవడంతో మురుగు రోడ్డు మీదకి ప్రవహించింది. మురుగు నీరు సమీప దుకాణాల్లోకి చేరింది. దీంతో దుకాణ దారులు ఇబ్బందులు పడ్డారు. గతంలోనూ ఇలా మురుగు వచ్చిందని.. దీనిపై అధికారులకు తెలిపినా పట్టించుకున్న వారు లేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిని అధిక వర్షానికి బాల ఏసు దేవాలయ ప్రాంగణం ముందు భాగం వర్షం నీరుతో నిండిపోయింది. నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



చర్చి ముందు భాగంలో చేరిన వర్షం నీరు

దాసాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

తెనాలి: పట్టణ గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో శ్రీదాసాంజనేయస్వామి 16వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజైన బుధవారం పెనుగొండ క్షేత్ర పీఠాధపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) స్వయం పర్యవేక్షణలో 1108 అరటి పళ్లతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సింధూర అర్చన, హారతి, మంత్రపుష్పం చేశారు. మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాధం రాజేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు. హనుమజ్జయంతి రోజైన గురువారం మామిడి ఫలార్చన జరుగుతుందని, బాలస్వామీజీ పుష్కర నీటిని భక్తులకు అందజేస్తారని తెలిపారు.

ప్రారంభమైన శ్రీ ప్రపత్తాంజనేయుని బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: మండల పరిధిలోని నండూరు గ్రామంలో కొలువైన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం విఘ్నేశ్వర పూజతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి అనుగ్రహం పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను హనుమత్ పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాస శర్మ పర్యవేక్షించారు. గురువారం హనుమజ్జయంతి పురస్కరించుకుని ఉదయం నిత్య అనుష్టానములు, స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేక అర్చనలు, శతసహస్ర నాగవల్లీ దళార్చన, హోమాలు, అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతాయని శ్రీనివాస శర్మ తెలిపారు. హనుమజ్జన్మ కథ, సాయంత్రం లలితా విష్ణు సహస్రనామ పారాయణ, సహస్ర నామార్చన, హోమం, పంచహారతులు, వేద స్వస్తి ఉంటాయన్నారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

అకాల వర్షం





చినరావూరు వెళ్లే ప్రధాన రహదారి చిన్నపాటి వర్షానికి జలమయం అవుతుంది. బుధవారం ఉదయం కొద్దిసేపు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పార్కు ప్రక్క రోడ్డుతో పాటు రైల్వే స్టేషన్, తోటకు వెళ్లే రోడ్లు జలమయం అయ్యాయి. దీనికి కారణం రహదారులు పల్లంలో ఉండటమే. ఈ రోడ్లపై చినరావూరులో నివశించే వారు కాకుండా జగ్గడిగుంటపాలెం, పెదరావూరు గ్రామ ప్రజలు కొందరు వెళ్తుంటారు. వర్షం పడితే నీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు ఎత్తు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. -తెనాలిఅర్బన్

హనుమజ్జయంతి వేడుకలు నేడు

రామచంద్రాపురం(మంగళగిరి): మండలంలోని రామచంద్రాపురంలో కొలువైన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలోని శ్రీ ఆంజనేయస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం బుధవారం తెలిపింది. హనుమజ్జయంతిని పురస్కరించుకుని స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, హనుమాన్ చాలీసా పఠనం, నైవేద్య సమర్పణ జరగనున్నట్లు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

మంగళగిరి: పట్టణంలోని జాతీయ రహదారి సమీప ఇండియన్ బ్యాంక్ ఆవరణలో దిచక్రవాహనం చోరీ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు సయ్యద్ తెలిపిన వివరాల ప్రకారం.. పార్కింగ్‌లో రోజూ లానే తమ ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేయగా బుధవారం తెల్లవారుజామున ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మరో ద్విచక్రవాహనంపై వచ్చారు. ఒకరు తన వాహనం తీసుకుని వెళ్లారని తెలిపారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును టీడీపీ నాయకులు బుధవారం అందజేశారు. తాడేపల్లి అమరారెడ్డినగర్‌కు చెందిన కొంకి మోహనరావు రోడ్డు ప్రమాదంలో జనవరి 17వ తేదిన మృతి చెందారు. పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో సభ్యత్వ బీమా చెక్కు రూ.5 లక్షలు మంజూరు కాగా నాయకులు మోహనరావు కుటుంబ సభ్యులకు అందజేశారు.

మహంకాళీ అమ్మవారి గ్రామోత్సవం



దుగ్గిరాల: దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరు గ్రామంలో కొలువైన శ్రీ మహంకాళీ అమ్మవారి గ్రామోత్సవం బుధవారం కనులపండువుగా జరిగింది. 5వ రోజు చిలువూరు, తుమ్మపూడి, మంచికలూడి, కంఠంరాజు కొండూరు గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.